క్లుప్తంగా

నేడు పట్టణంలో ప్రజాదీవెన

పెడన: పట్టణంలోని 6, 7, 8వ వార్డులలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొంటారని పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ బండారు మల్లి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు 8వ వార్డులోని వీరభద్రపురంలోని వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పట్టణంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

'నవోదయ'లో ప్రవేశానికి ఎంపిక



గూడూరు: జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన కంచాకోడూరు విద్యార్థి ఉడుముల పవన్ తేజ 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించాడు. గత జనవరిలో జవహర్ నవోదయ విద్యా సమితి ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. కంచాకోడూరు(హెచ్.డబ్ల్యూ) ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పవన్‌తేజ పరీక్షకు హాజరయ్యాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.గంగారామ్ శిక్షణలో పవన్‌తేజ నవోదయ విద్యాలయంలో ప్రవేశం సాధించడం పట్ల తల్లిదండ్రుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం పవన్‌తేజ సోదరి ఉడుముల వేదశ్రీ కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశం సాధించింది.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ




మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్యూలైలన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



చల్లపల్లి: గుడారాల్లో జీవిస్తున్న నిరుపేద ఎస్టీల జీవితాల్లో వెలుగు నింపేందుకు క్రమం తప్పకుండా సహాయం అందిస్తున్నట్లు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కోమలానగర్ పాత ప్రభుత్వాసుపత్రి ఓపీ సెంటర్, నారాయణరావు నగర్ ప్రభుత్వాసుపత్రి వెనుక రెండు మురికివాడల్లో జీవిస్తున్న నిరుపేద ఎస్టీలకు, చల్లపల్లి, పాగోలు గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్య బాధితులకు ఐవీఎం సురేష్ ఆర్థిక సహకారంతో రూ.లక్షన్నర వ్యయంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముమ్మనేని రాజకుమార్ (నానీ), ఐవీఎం ప్రతినిధి వేములపల్లి స్విటిన్ రాస్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు తప్పవు



కోనేరుసెంటర్: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, లేకపోతే చర్యలు తప్పవని బందరు రూరల్ ఎస్‌ఐ పద్మ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఆమె స్టేషన్ పరిధిలో చెడునడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలను పురస్కరించుకుని అల్లర్లకు పాల్పడినా, అలజడులు సృష్టించేందుకు ప్రయత్నించినా క్షమించే ప్రసక్తే ఉండదన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి రోజూ స్టేషన్‌కు వచ్చి హాజరు వేయించుకోవాలని సూచించారు. అందరూ ఎప్పుడు పిలిస్తే అప్పుడు కనపడేలా అందుబాటులో ఉండాలన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లాల్సివస్తే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గతంకంటే మిన్నగా అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు
- ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాముతో కలిసి గూడూరులో పర్యటన



పోసినవారిపాలెంలో ప్రజలతో మమేకం అవుతున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు,ఉప్పాల రాము

గూడూరు: గత 50 సంవత్సరాలలో జరగని సంక్షేమం ప్రస్తుత ఐదేళ్ల కాలంలో జరిగిందని వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా గూడూరు మండలం పోసినవారిపాలెం పంచాయతీ పరిధిలో పెడన అభ్యర్థి ఉప్పాల రాముతో కలసి చంద్రశేఖరరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన నియోజకవర్గానికి గత ఐదేళ్ల కాలంలో రూ.1500 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేరాయన్నారు. కరోనా పరిస్థితులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. కరోనా కాలం పోను, మూడేళ్లకే ఇంత చేసిన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మరో ఐదేళ్లు అవకాశం ఇస్తే ప్రజలకు ఎంత మేలు చేస్తాడో ప్రజలు గ్రహించాలన్నారు. అవనిగడ్డ ప్రాంతానికి చెందిన తాను క్యాన్సర్ వైద్య నిపుణుడిగా 35 ఏళ్లు పనిచేశానని, గత ఐదేళ్లుగా రాష్ట్ర హెల్త్ కమిటీలో సభ్యుడిగా పనిచేశానన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై తన వంతు కృషి చేశానన్నారు. హైటెక్ సిటీ భవనాలు కడితే అభివృద్ధి అయిపోదన్నారు. అభివృద్ధి అనే పదానికి కొన్ని కొలమానాలు ఉంటాయన్నారు. గత ఐదేళ్ల కాలంలో మౌలిక వసతుల కల్పన, జీడీపీ, తలసరి ఆదాయం తదితర అంశాల్లో మెరుగైన ప్రగతి సాధించామన్నారు. పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులతో ప్రతి గ్రామానికి నిధులు తీసుకువచ్చానన్నారు. ప్రతి గ్రామంలో ఏదో ఒక పనిచేశానన్నారు. అనేక గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నాయని, మరికొన్ని చోట్ల ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభం కాలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పనులు మొదలవుతాయన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ప్రతి ఊరిలో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలన్న ప్రాధాన్యంతో నిధులు మంజూరు చేయించానన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే పెడన ప్రాంతానికి కేటాయించనన్ని నిధులు గత రెండు నెలల కాలంలో మంజూరు చేయించానన్నారు. జగనన్న అండతో రానున్న కాలంలో పెడన నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నడిపిస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పార్టీ నాయకులు పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, పిండి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన నాయకులకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి.

ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు



గ్రామస్తులతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో చేపట్టిన పేదల సంక్షేమాన్ని కొనసాగించేందుకు సహకరించాలని అవనిగడ్డ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. నాగాయలంక మండలంలోని సముద్ర తీర గ్రామం పెదకమ్మవారిపాలెంలో ఆదివారం సింహాద్రి పర్యటించి గ్రామంలోని ప్రజలు, పెద్దలు, ముఖ్యులతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులుతో ఆత్మీయ సమావేశం జరిపారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా రూ.1858 కోట్లు మేరకు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దివిసీమ తీరగ్రామాల ప్రజలకు కుల, మత వర్గ బేధాలు లేకుండా ఎంతో సంక్షేమం, అభివృద్ధి చేకూరిందన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావుకు, తనకు మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, యూత్ జిల్లా కార్యదర్శి ఆకుల బాబీకుమార్, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, తోట కృష్ణ, బండ్రెడ్డి శ్రీనివాసరావు, గ్రామస్తులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

సోమయాజి వైశ్య సమాజం సేవలు అభినందనీయం

-ఎమ్మెల్యే పేర్ని నాని



కార్యక్రమంలో మాట్లాడుతున్న పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. సమాజం సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక బృందావనపుర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ సమాజం ద్వారా గత 60 ఏళ్లుగా అధ్యక్షుడిగా గుడివాడ వెంకటగున్నయ్య శెట్టి అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు. సుదీర్ఘకాలం సంఘ అధ్యక్షుడిగా పనిచేస్తూ గాంధీ విద్యాలయంను స్థాపించి ఎంతో మందికి విద్యను చేరువచేశారన్నారు. ఆర్యవైశ్యులకు పెద్దగా వ్యవహరిస్తూ అన్ని వర్గాలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు, మాజీ మంత్రి రోశయ్య వంటి వారు తమకు తెలియకపోయినా వారి సమకాలికులైన గున్నయ్యశెట్టితో అనుబంధం ఉండటంతో ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు మచిలీపట్నం వచ్చిన వెంటనే గున్నయ్యశెట్టిని కలవటం చూస్తే ఆయనకు ఉన్న విలువ ఏంటో అర్థమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, తాడేపల్లి మెహర్‌బాబా, శ్రీకాకోళపు నరసింహగుప్తా, సురేంద్ర, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు యెండూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేర్ని కిట్టు

స్వర్ణోత్సవాలకు 'వాసవీ' ఆలయం ముస్తాబు

3 నుంచి వాసవి క్షేత్రంలో మహాకుంభాభిషేకం



విద్యుత్ దీపాలంకరణలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం

పెడన: పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నిర్మించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో త్రయాహ్నిక మహాకుంభాభిషేకాల మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 3, 4, 5వ తేదీలలో జరిగే ఈ మహోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవ క్షేత్రమైన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని ముస్తాబు చేస్తున్నారు. 1974 మార్చిలో వాసవి క్షేత్రం ప్రతిష్ఠ జరిగింది. ఆర్యవైశ్య సంఘ పెద్దలు కొల్లిపర వెంకట పూర్ణచంద్రావు, జూపూడి పూర్ణ పుల్లారావు, మామిడి నరసింహారావు తదితరులు శ్రీ వాసవి క్షేత్రం స్థలం కొనుగోలుకు కీలక పాత్ర పోషించారు. వాసవి క్షేత్రం నిర్మాణానికి ఆర్యవైశ్య సంఘ పెద్దలు తమ్మన గంగయ్య, కొల్లూరి శ్రీనివాసరావు, చిట్టూరి మాధవరావు, జవాజి బ్రహ్మశాస్త్రి, జల్లూరి సూర్యప్రకాశ్రావు, జల్లూరి మాధవరావు, కొల్లూరి రామచంద్రరావు, తదితర పెద్దల నేతృత్వంలో శ్రీ వాసవి అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు శ్రీమహాగణపతి, నవగ్రహాలు, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, శ్రీ పద్మావతి అలివేలు మంగ వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప అయ్యప్ప స్వామి వారి ఆలయం, శ్రీ మహిషాసుర మర్దని, శ్రీ బాలా త్రిపుర సుందరి ఉపాలయాలు నిర్మించారు. ప్రతి సంవత్సరం దసరా నవరాత్రులు, వాసవి అమ్మవారి జయంతి, శ్రీ మహాగణపతి ఆలయంలో వినాయక చవితి పండుగ నిర్వహిస్తూ వస్తున్నారు. కార్తికమాసంలో కాశీ విశ్వేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు, శ్రీ అయ్యప్ప స్వామి వారికి మండల పూజల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు పడిపూజ కార్యక్రమం ఆరు శనివారాలు అయ్యప్ప స్వాములకు, శివ స్వాములకు, భవానీలకు సద్ది నిర్వహిస్తూ వస్తున్నారు. ధనుర్మాసంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు భోగం పూజా కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను, శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తామని డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) తెలిపారు. స్వర్ణోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీవాసవి క్షేత్రంలో ఏప్రిల్ 3, 4, 5వ తేదీలలో నిర్వహించే సంపూర్ణ మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమానికి సంబంధించి ఆలయాన్ని ఆలయాన్ని నూతన రంగులతోను, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్లతో ముస్తాబు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



శివరామపురంలో సీతారామయ్యను ఓదార్చుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

శివరామపురం(మోపిదేవి): మండలంలోని శివరామపురానికి చెందిన మల్లంపాటి సీతారామయ్య భార్య వసుమతి (90) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. బాధితుడు సీతారామయ్య వైఎస్సార్ సీపీ ప్రారంభం నుంచి పార్టీలో కొనసాతున్నారు. సీతారామయ్య దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎమ్మెల్యే రమేష్ బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం..

మృతురాలు వసుమతి కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది సేకరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో మృతదేహాన్ని ఏలూరు ఆశ్రమ మెడికల్ కళాశాలకు అప్పగించినట్లు భర్త సీతారామయ్య వివరించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబు, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, జన్యావుల రామమోహనరావునివాళులర్పించినవారిలో ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కోనేరుసెంటర్: మండలంలో అక్రమంగా మట్టి, బుసక తరలింపునకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.సతీష్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మట్టి, బుసక తరలింపు నిషేధమన్నారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి, బుసక తరలింపునకు మైనింగ్‌శాఖ నుంచి అనుమతి ఉండాలన్నారు. కమిటీలు మట్టి, బుసక తరలింపు చర్యలపై ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల వారీగా సమాచారం వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా అలసత్వం ప్రదర్శించినా శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

అవనిగడ్డ: మండల పరిధిలో అక్రమంగా ఇసుక, బుసక, మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు అవనిగడ్డ, పులిగడ్డ, అశ్వరావుపాలెం, దక్షిణ చిరువోలు లంక, మోదుమూడి, ఎడ్లంక,వేకనూరులో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ ఉద్యోగులతో ఒక్కో గ్రామానికి నలుగురు చొప్పున ప్రత్యేక బృందాలను నియమించినట్లు చెప్పారు.

ఆలయంలో ధ్వజ కళా వాహనం

మొవ్వ: మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన మొవ్వ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ధ్వజ కళా వాహనం కార్యక్రమాన్ని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు. వేదపండితులు వేదాంతం హరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండవ దినాకర్, లక్ష్మీ దంపతులు స్వామి వారి శాంతి కల్యాణాన్ని జరిపించారు.

• మరణంపై ఏసుక్రీస్తు సాధించిన విజయమే ఈస్టర్



అవనిగడ్డ బెతేల్ ప్రార్థనా మందిరంలో ఈస్టర్ వేడుకలో ఎమ్మెల్యే సింహాద్రి



చిలకలపూడి హోసన్నా చర్చిలో ప్రార్థనల్లో పేర్ని కిట్టు, దేవిడ్‌శామ్యూల్, థామస్‌నోబుల్



ఎల్‌ఈఎఫ్ చర్చిలో భక్తుల ఈస్టర్ గీతాలాపన

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పర్వదినం

ఏసుక్రీస్తు పునర్జీవానికి గుర్తు, మరణంపై ఏసుక్రీస్తు సాధించిన విజయమే ఈస్టర్ పండుగని పలువురు క్రైస్తవ దైవసేవకులు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు సిలువ వేయబడి తిరిగి మూడో రోజున సజీవుడై లేచిన సందర్భంగా ఆదివారం ఈస్టర్ పండుగను నగరంలోని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

–మచిలీపట్నంటౌన్/అవనిగడ్డ/పెడన



ఆర్‌సీఎం చర్చి ఆవరణలో విశ్వాసుల కొవ్వొత్తుల ప్రదర్శన



ఘంటసాల గిల్గాలు చర్చిలో దైవజనురాలు దేవమణి ధనరాజు, విశ్వాసులు



చల్లపల్లిలో జీజీఎం చర్చి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ నాగ ప్రసాద్, ఎస్‌ఐ



ఎల్‌ఈఎఫ్ చర్చిలో ఈస్టర్ ఇతివృత్తాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

ఇఫ్తార్ విందులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చంద్రశేఖరరావు, పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రంజాన్ ఉపవాస దీక్షను ముగించుకుని ఆదివారం రాత్రి ముస్లిలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. స్థానిక సుకర్లాబాద్‌లోని రజా మసీదు వద్ద ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లింలతో సహపంక్తిలో కూర్చుని విందు స్వీకరించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వీరిద్దర్ని మసీదు కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ చంద్రశేఖరరావు కుమారుడు రామ్‌చరణ్, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, డైరెక్టర్ మొహసిన్, 10వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ భాషా, షేక్ మొహమ్మద్‌సాహెబ్, అన్వర్ హుస్సేన్, షేక్ రబ్బానీ, ఖలీద్ పాల్గొన్నారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేళ్లమ్మ అమ్మవారిని సోమవారం ప్రతిష్ఠించనున్నారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రతిష్ఠమూర్తికి ధాన్యాదివాసం, వస్త్రాదివాసం, పుష్పాభివాసం, శయ్యాదివాసం కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గణపతి, దుర్గాశక్తి హోమాలు చేశారు. సోమవారం ఉదయం 7.56 గంటలకు గణపతి, వేళ్లమ్మ అమ్మవారు, పోతురాజు శిలలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మహాపూర్ణాహుతి, అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు.

గ్రామ దేవతలకు పూజలు

కృత్తివెన్ను: అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామదేవతల జాతర మహోత్సవాన్ని ఆదివారం యండపల్లిలో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు గ్రామంలో ఊరేగింపుగా తిరిగారు. గ్రామదేవతలైన పల్లాలమ్మ, మారెమ్మలను పూజించారు. యండపల్లిలో మొక్కుబడులు తీర్చుకున్నారు.

కోలాహలంగా ముత్యాలమ్మ జాతర



జాతరలో మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు, భక్తులు

కమ్మనమోలు(నాగాయలంక): గ్రామంలో కొలువైయున్న శ్రీముత్యాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఆదివారం కోలాహలంగా జరిగింది. మొక్కుబడులు చెల్లించుకునేందుకు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు ఆధ్వర్యంలో తొలుత వినాయక పూజ,పుణ్యాహవాచన, మండపారాధన తదుపరి అమ్మవారికి పంచామృత చందన, పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు జరిపి విశేష అలంకరణ చేసారు.. అంతకు ముందు శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటి పెద్దల పర్యవేక్షణలో జాతర సంప్రదాయాలకు అనుగుణంగా ప్రత్యేకపూజలు జరిపి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. డప్పు నృత్యాలు, మేళతాళాలతో, నైవేద్యం పళ్ళాలతో భక్తులు బంధు మిత్రులతో కలసి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.